తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


## భక్తులతో పోటెత్తిన కాణిపాకం



కాణిపాకం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు.అలాగే దేవస్థానంలో నూతన అద్దాల మండపం సంప్రోక్షణ పూజాధి కార్యక్రమాలు జరుగడంతో భక్తులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెదేపా నాయకుల ఆందోళనలు

### పోలీసులతో వాగ్వివాదం

### -ఎట్టకేలకు స్టేషన్‌కు తరలించిన పోలీసులు





శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా ఉదయం స్వర్గీయ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు ఎన్టీరామారావు విగ్రహం వద్ద నియోజకర్గ తెదేపా నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా ఆందోళన నిర్వహించారు. దీంతో పోలీసులతో పాటు ప్రత్యేక బలగాలు మోహరించాయి. సైకో జగన్ డౌన్.. డౌన్.. సిఎం డౌన్ డౌన్ అంటూ ప్లేకార్డులు ప్రద ర్శన చేశారు. చట్టాన్ని, న్యాయాన్ని కాపాడాలని, బాబును వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. అయితే ట్రాఫిక్, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేయరాదని సెక్షన్ 30 ఉందని పోలీసులు వివరించారు. అయినా వీటిని పట్టించుకోకుండా తెలుగుదేశంపార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి, దశరదాచారి, రాష్ట్ర సాంస్కృతిక కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం, మాజీ మున్సిపల్ ఛైర్మన్ మిన్నల్‌రవి, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్, పార్టీ సీనియర్ నాయకురాలు ఇందిరాపవార్, పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, పార్లమెంటు రైతు నాయకు డు ప్రకాష్‌నాయుడు, మైనార్టీ నాయకులు అస్మత్, బిసి నాయకుడు పోలూరు శ్రీనివాసులురెడ్డి, మాజీ కౌన్సిలర్ ప్రసాద్‌నాయుడు, యాదగిరి పలువురు నాయకులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన తెలిపారు. 10గంటలకు ప్రారంభమైన నిరసన ప్రదర్శన సుమారు ఒకటిన్నర గంటపాటు సాగగా పోలీసులు ఇక్కడ నుంచి ఖాళీ చేయాలని ఆదేశించినా పట్టించుకోక పోవడంతో వారిని బలవంతంగా లాక్కెళ్ళి పోలీసు వాహనాల్లో టు టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే తమకు సమయం ఇవ్వాలని పోలీసుల కాళ్ళు పట్టుకుని ప్రాధేయపడినా వారు కనికరించకపోవడంతో తెదేపా శ్రేణులను బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. మహిళా నాయకురాళ్ళను మహిళా పోలీసుల ద్వారా స్టేషన్‌కు తరలించారు. ఒదశలో రంగినేని చెంచయ్యనాయుడు, బుజ్జి, కాసరం రమేష్, రెడ్డివారి గురవారెడ్డిలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.ఒదశలో టుటౌన్ సిఐ మల్లి కార్జున తోపులాటలో కిందపడిపోవడం జరిగింది. రూరల్ సిఐ అజయ్‌కుమార్, టుటౌన్ సిఐ మల్లిఖార్జున, సిబ్బంది, ప్రత్యేక బలగాలు కలసి అందరినీ స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చేశారు. రాత్రి 8గంటల వరకు అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయలేదు. అయితే సాయంత్రం తమకు ఎలాగైనా బయటకు పంపాలని తెలుగుదేశంనాయకులు పోలీసులతో వాగ్వివాదం జరగడంతో తెదేపా రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి సొమ్మసిల్లిపడిపోయారు. దీంతో పోలీసులు హుటాహుటిన ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అనంతరం తిరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మొత్తం 30మందికి అదుపులోకి తీసుకున్నారు.

# గృహ నిర్బంధంలో 'దేశం' నాయకులు

### - 14 రోజుల రిమాండ్‌కు 'దేశం' అధినేత చంద్రబాబునాయుడు

### - తెలుగుదేశం రోడ్డెక్కి నిరసనలు వ్యక్తం చేయకుండా పోలీసులు వ్యూహం



నిరసన వ్యక్తం చేస్తున్న 'దేశం' నేతలను తీసుకెళ్తున్న పోలీసులు.

చిత్తూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ విజయవాడ ఎసిబి కోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఎవ్వరు రోడ్డెక్కి నిరసనలు వ్యక్తం చేయకుండా వారిని పోలీసులు ఆదివారం సాయంత్రం నుండి గృహ నిర్బంధం చేశారు. చిత్తూరులో మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్, జిల్లా తెలుగుదేశం కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి వెంకిటీల సురేంద్రకుమార్ తదితరులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అలాగే పూతలపట్టు నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జీ మురళీమోహన్, జిడినెల్లూరు నియోజకవర్గ 'దేశం' ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్‌లను పోలీసులు ఆదివారం సాయంత్రం నుండి గృహ నిర్బంధం చేశారు. అలాగే తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు నియోజకర్గం కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కుప్పంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడును సిఐడి పోలీసులు శుక్రవారం రాత్రి నంద్యాలలో అదుపులోకి తీసుకొని శనివారం తెల్లవారుజాము అరెస్టు చేసి విజయవాడ ఎసిబి కోర్టుకు తరలించిన విషయం తెలిసిందే. తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టు విషయం తెలిసిన వెంటనే జిల్లాలో తెలుగుదేశం నాయకులు శనివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అయితే పోలీసులు ముందస్తు జాగ్రత్తగా ముఖ్యమైన తెలుగుదేశం నాయకులను గుర్తించి వారిని గృహ నిర్బంధం చేశారు. మరికొంతమందిని రోడ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో పోలీసులు అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో ఆదివారం సైతం జిల్లా వ్యాప్తంగా తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు నిరసనలు వ్యక్తం చేశారు. చిత్తూరు కొంగారెడ్డిపల్లి షర్మన్ బాలికల పాఠశాల ఎదుట జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, రాష్ట్ర పార్టీ కార్యదర్శి వెంకిటీల సురేంద్రకుమార్ తదితరులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. యాదమరిలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మొరార్జీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబ్బీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.

## నేడు టిడిపి బంద్‌కు పిలుపు

తిరుపతి,సెప్టెంబర్ 10ప్రభాతవార్త: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ సిఎం చంద్రబాబుకు న్యాయస్థానం రిమాండ్ విధించిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎక్కడా అవాంఛనీయసంఘటనలు జరగకుండా పోలీసు ఉన్నతాధికారులు 144సెక్షన్ అమలుచేస్తున్నారు. ఆదివారం రాత్రి నుండి ఈ సెక్షన్ చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ అమలవుతోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు రిమాండ్‌కు ఆదేశించడంతో టిడిపి నేతలు బంద్‌కు పిలుపునిచ్చాయి. ఇప్పటికే చంద్రబాబును సిఐటి అదుపులోకి తీసుకుని అరెస్టుచేసిన 48గంటల నుండి శాంతిభద్రతలు అదుపులో ఉంచడం, అవాంఛనీయసంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి భద్రత చర్యలు తీసుకున్నారు. ఇదే సమయంలో టిడిపి ముఖ్య నేతలను, శ్రేణులను పోలీసులు ముందస్తుగా గృహనిర్బందం చేశారు. దీంతో చిన్నపాటి సంఘటన జరగకుండా కట్టుదిట్టం చేశారు. ఈ సమయంలో ఆదివారం రాత్రి న్యాయస్థానం బాబుకు రిమాండ్ విధించడంతో టిడిపి శ్రేణులు బంద్‌కు పిలుపునిచ్చాయి. అయితే ఈ బంద్ సవ్యంగా సాగాలంటే టిడిపి నేతలు, కార్యకర్తలు రోడ్డుపైకి రావాలి. కానీ 144 సెక్షన్ అమలులో ఉండటంతో మరీ పరిస్థితి ఏంటనేది అందరిలోనూ చర్చకు దారితీసింది. పోలీసు వర్గాలు కూడా ప్రజలకు ఇబ్బంది కలిగించినా ఆందోళనకారులను చూస్తూ ఊరుకోరు. మరీ సోమవారం బంద్ జరగడం కొంత అనుమానమేనని ఆపార్టీ నేతల్లో చర్చనీయాంశంగా మారింది.

### కల్యాణ వెంకన్న ఆలయంలో

## శాస్త్రోక్తంగా అశ్వపూజ

### ఆగమోక్తంగా మహాశాంతి వరుణ యాగం



చంద్రగిరి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం అర్చకులు శాస్త్రోక్తంగా అశ్వపూజ నిర్వహించారు. కళ్యాణ వెంకన్న ఆలయంలో శ్రీనివాస అష్టోత్తర శతకుంఢాత్మక మహాశాంతి వరుణ యాగం వేదపండితులు వేదమంత్రోచ్ఛారణల నడుమ ఆగమోక్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం ఉత్సవమూర్తులను యాగశాలలో వేంచేపు చేసిన ఋత్వికులు వైధిక కార్యక్రమాలు నిర్వహించారు. జెఈఓ వీరబ్రహ్మం అశ్వపూజలో పాల్గొని ఒరపత్యేక పూజలు నిర్వహించారు. అశ్వానికి ఆహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాద్, సూపరింటెంట్స్ తేనెపల్లి వెంకటస్వామి, నర్రా మునిచెంగల్రాయులు, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, బాలాజీ రంగాచార్యులు, కంకణ భట్టార్ సీతారామాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ధుర్యోధన వధ

### భక్తిప్రపత్తుల నడుమ అగ్నిగుంఢ ప్రవేశం



రామచంద్రాపురం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: మహాభారత ఉత్సవాలలో అత్యంత మహత్తర ఘట్టం ధుర్యోధన వధ ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లిలో మహాభారత ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పదిట్లబైలు చెందిన మునిరత్నం ధుర్యోధనుడుగా, దొరస్వామి భీమసేనుడుగా పాత్రధారనలు గావించి అలరించారు. ధుర్యోధుడు ప్రాణ భయంతో గంగ అడుగు భాగానికి చేరుకుని జలస్థంభన విద్యచే దాగివుంటాడు. పాండవులు, శ్రీకృష్ణుడు అక్కడికి చేరుకుని ధుర్యోధనుడుని యుద్ధానికి రమ్మని ధర్మరాజు ఆహ్వానిస్తాడు. ఎంతకీ అతని నుండి సమాధానం లభించకపోవడంతో భీమసేనుడు తన పరుషపదజాలంతో రెచ్చగొడుతూ యుద్ధానికి ఆహ్వానించి, పాండవులలో ఏ ఒక్కరినీ ఓడించినా నీ రాజ్యం తిరిగి నీకు ఇస్తామని సంధి చేస్తాడు. అయితే రాజనీతిని విస్మరించని ధుర్యోధనుడు తనకు సమ ఉజ్జీ అయిన భీమసేనుడుతోనే యుద్ధం చేస్తానని గంగ నుండి వెలుపలికి వస్తాడు. ఈ క్రమంలో ఇరువురి నడుమ జరిగిన పోరు ఆహుతులను ఆకట్టుకున్నది. చివరికి భీమసేనుడు తన గధాదండంతో ధుర్యోధనుడి తొడలు విరగొట్టి అంతం చేశాడు. ధుర్యోధనుడి వధతో ఒక్కసారిగా ప్రజలు ధుర్యోధనుడి భారీ ప్రతిమ నుండి మట్టిని సేకరించడానికి పోటీ పడ్డారు. రాత్రి 7 గంటలకు ద్రౌపథీ అమ్మవారి అగ్నిగుంఢ ప్రవేశం కార్యక్రమంలో భక్తులు ఉపవాస దీక్షలతో, భక్తిప్రపత్తుల నడుమ అగ్నిగుంఢ ప్రవేశం చేసి మ్రొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు అగ్నిగుంఢం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిగనిగలాడుతున్న అగ్నిగుంఢంలోని నిప్పుకణికలను అమ్మవారికి వడిబాలగా కట్టి అమ్మవారి వెంట అగ్నిగుంఢ ప్రవేశం చేశారు. భక్తుల గోవింద నామస్మరణలు మారుమ్రోగుతుండగా వందలాధి మంది భక్తులు అగ్నిగుంఢ ప్రవేశం చేశారు.

## చంద్రబాబు అరెస్ట్ వైకాపా సమాధికి పునాది

### - ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ - కుప్పంలో తెదేపా శ్రేణుల సామూహిక నిరాహార దీక్ష

కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌తో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సమాధి కట్టేందుకు పునాది ఏర్పడిందని ఎమ్మెల్సీ, కుప్పం టిడిపి సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. రా ష్ట్ర పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఆదివారం కుప్పం ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబును అరెస్ట్ చేస్తే కుప్పంలో వైకాపా నేతలు టపాకాయలు కాల్చారని తాము మరలా అధికారంలో వస్తే ఏం చేయాలో చేసి చూపుతామన్నారు. కుప్పం నుంచి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును లక్ష మెజార్టీతో గెలిపించుకుని రాష్ట్రానికి ముఖ్యమం త్రి చేస్తామన్నారు. కుప్పానికి తాను లోకల్ కాదని ఎమ్మెల్సీ భరత్ చెప్పడం భావ్యం కాదన్నారు. తనకు కుప్పం ప్రజలు పట్టభద్రుల ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించారని పేర్కొన్నారు.తన ప్రోటోకాల్ నియోజకవర్గం కుప్పం అనే విషయం మరిచారా అని ప్రశ్నించారు. తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో చంద్రబాబు ఎలాంటి తప్పు చేయలేదని వైకాపా ప్రభుత్వం కుట్రతోనే చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ చేయించిందని ఆరోపించారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వంకు ప్రజలే వచ్చే ఎన్నికల్లో గట్టిగా గుణపాఠం చెబుతారన్నారు. ఈసందర్భంగా తెదేపా నేతలు నల్లబా ్యడ్జీలు, నల్ల కండువాలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేతలు గోపీనాథ్, డా॥ బిఆర్ సురేష్‌బాబు, కన్వీనర్



ఆర్. చంద్రశేఖర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రూరల్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నేతలు సాంబశివం, సత్యేంద్రశేఖర్, డా॥ వెంకటేష్, కాణిపాకం వెంకటేష్, బాబు నాయుడు, కన్నన్, మంజునాథ్, మణి, కౌన్సిలర్లు సోమశేఖర్, వేలు, ఆంజనేయరెడ్డి, ఆనందరెడ్డి, సతీష్, అనసూయ, వసంతమ్మ, పద్మ, స్వాతి రాజగోపాల్‌తో పాటు నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా నూతన అద్దాలమండపంకు సంప్రోక్షణ



4లో

## వైభవంగా లక్ష్మీనారాయణస్వామి ఆలయ కుంభాభిషేకం



నగరి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధి కరకంతాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనారాయణస్వామి, శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తుల ఆలయ మహా కుంభాభిషేక వేడుకలు ఆదివారం వైభవగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో వేదపారాయణం ప్రారంభించారు. పెద్ద ఎత్తున యాగ పూజలు నిర్వహించి గోపూజ, నాడీ సంధానం, ప్రాణ ప్రతిష్ట, పూర్ణాహుతి, కలశ పూజలు నిర్వహించారు. కుంభాభిషేక పూజల్లో పాల్గొన్న మంత్రి రోజా భక్తిశ్రద్ధలతో కుంభాభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. యాగ పూజలు చేసి సిద్ధం చేసిన శిఖర కలశ కుంభాభిషేక జలాన్ని తలపై ఎత్తుకుని ఆలయ ప్రదక్షిణం చేశారు. కలశంతో పాటు ప్రత్యేకంగా శిఖర గోపురం వరకు ఏర్పాటు చేసిన మెట్లపై నుంచి ఆలయ ఆలయ శిఖరం చేరుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ సంప్రదాయ బద్ధంగా శిఖర కలశానికి అభిషేకం చేశారు. ఆమె వెంట రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సెల్వమణి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు మురుగ, దయానిధి, ఇంద్రయ్య, కో-ఆప్షన్ సభ్యుడు ఎల్లప్పరెడ్డి, తనికాచలం తదితరులు పాల్గొన్నారు.

## స్థలం తీసుకున్నారు! నిర్మాణం మరిచారు!!

### ఏళ్ళ తరబడి అద్దెభవనాల్లో తపాలా కార్యాలనిర్వహణ

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 10 ప్రభాతవార్త కేంద్ర ప్రభుత్వ అధికారుల తీరు రోజు రోజుకు తీసికట్టుగా మారుతుంది. వ్యవస్థను పటిష్టపరచుటకు సంబంధించి స్పందించే అధికారులు కరువయ్యారు.వివరణ అడిగితే సమాధానం చెప్పే ఓపిక కూడా లేని అధికారి ప్రస్తుతం ఉండటం గమనార్హం.శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దశాబ్దాలుగా తపాలా కార్యాలయం అద్దెభవనాల్లో నిర్వహించటం ఆనవాయితి.సుమారు 20సంవత్సరాల క్రితం తపాలా కార్యాలయానికి అయ్యలనాడు చెరువులో కోట్లరూపాయలు విలువ చేసే స్థలాన్ని కేటాయించగా నిర్మాణాలు చేపట్టుటకు ప్రయత్నిం చాల్సిన తపాలా అధికారులు స్పందించకపోవటం పైగా ఇక్కడి యూనియన్ నాయకులు అద్దెభవనాలకే ప్రాధాన్యత ఇవ్వటం గమనించదగ్గ విషయం.

**అయ్యలనాడు చెరువులో స్థలం:**

శ్రీకాళహస్తి పట్టణంలో అయ్యలనాడు చెరువు కేంద్రబిందువు. ఇక్కడ ఆర్‌టిసి బస్టాండు, ఏరియా ఆసుపత్రి, తుడా



ముళ్ళ పొదల్లో తపాలా కార్యాలయ భవన స్థలం

భవనాలు,జూనియర్ కళాశాల, ఆర్అండ్‌బి భవనాలు,అతిధి గృహాలు, తెలుగుదేశం పార్టీ కార్యాలయం పలు సంఘాల కార్యాలయాలు ఉన్నాయి.20 సంవత్సరాల క్రితం ఇక్కడి నగరివీధిలోని ఓ అద్దెభవనంలో ఏళ్ళ తరబడి నిర్వహిస్తున్న తపాలా కార్యాలయాన్ని ఖాళీ చేయూలని భవన యజమానులు కోరగా అప్పటి అధికారులు అప్పటి పాలకులు మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డిని ఒప్పించి ఆర్అండ్‌బి భవనం తెలుగుదేశం పార్టీ కార్యాలయ భవనాల మధ్య తపాల కార్యాలయంకు స్థలం కేటాయించారు. అయితే ఇక్కడ సొంత భవనాల నిర్మాణానికి సంబంధించి పట్టించుకునే దిక్కులేదు. ప్రస్తుతం పట్టణానికి ఓ మూల విఎంసి సర్కిల్ వద్ద అద్దెభవనాల్లో చాలి చాలని భవనంలో తపాలా ప్రధాన కార్యాలయం నిర్వహిస్తున్నారు.ఇక్కడకు వెళ్ళాలంటే పానగల్ బహాదూరుపేట ప్రాంతాల వారికి దూరం. అయితే నేడు తపాలా వ్యవస్థ అవసరం జనాలకు అంతగా లేదు. ఇక ప్రస్తుతం కార్యాలయంలో మొదటి అంతస్థులో ఉంది. ఇక్కడ మెట్టు ఎక్కాలంటే ముసలి ముతక అవస్థలు పడుతున్నారు. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ అధికారులకు పట్టదు.కానీ తపాల విభాగంలో బ్యాంకింగ్ వ్యవస్థ రావటంతో ప్రాధాన్యత పెరిగింది. ఏళ్ళ తరబడి శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో తపాలా ప్రదాన కార్యాలయం అద్దెభవనాల్లో నిర్వహిస్తుండగా యూనియన్ నాయకులు మాత్రం మీన మేషాలు లెక్కిస్తూ ప్రత్యామ్నాయం కోసం పలుమార్లు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డిని కలసినట్లు తెలిసింది.

**సూపరింటెండెంట్ వివరణ:**

దీర్ఘకాలంగానిర్లక్ష్యానికి గురైన తపాలా కార్యాలయ నిర్మాణానికి సంబంధించి ప్రభాతవార్త సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ జాఫర్ సాధిక్‌ను వివరణ కోరగా ఫోన్లో మీకు సమాధానం చెప్పాలా? చాలా సమస్యలు పెండింగ్‌లో ఉంటాయి. తపాలా అంటే ఆషామాషి కాదు. కేంద్రం స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అక్కడ ప్రాధాన్యత క్రమంలో చర్యలు తీసుకుంటారు.

# జిడినెల్లూరు 'దేశం' నియోజకవర్గ ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో నిరసన

పాలసముద్రం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:

తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడును రిమాండ్ విధిస్తూ విజయవాడలోని ఎసిబి కోర్టు ఆదివారం తీర్పు వెలువరించడంతో పాలసముద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్, రాష్ట్ర ప్రభావశీలుర కమిటీ సభ్యుడు భీమినేని చిట్టిబాబు ఆధ్వర్యంలో దేశం నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ 'దేశం' ఇన్‌ఛార్జీ థామస్, భీమినేని చిట్టిబాబులు మాట్లాడుతూ సిఎం వైఎస్



జగన్మోహన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడి 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం వున్న తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడును అరెస్టు చేయడం దారుణమన్నారు. కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డిని సిబిఐ అధికారులు అరెస్టు చేయలేకపోయారని, అయితే తమ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడును మాత్రం సిఐడి అధికారులు సులభంగా అరెస్టు చేసి తరలించారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య, ప్రధాన కార్యదర్శి అరుణ్‌నాధన్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబశివన్, మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శీనురాజు, నాయకులు హేమంత్‌రెడ్డి, అన్నామలై, శబరీవాసన్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

వెదురుకుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :



రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ రమేష్ బాబు ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని పచ్చికాపల్లం కూడలిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా తిరుపతి జిల్లా తిరుపతి రూల్ మండలం దుర్గసముద్రంకు చెందిన కార్తిక్, వరదయ్యలు దేవకుమార్, బాలాజీలు రామచంద్రాపురం మండలం స్వర్ణముఖి నది నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. వీరి పై కేసు నమోదు చేసి ట్రాక్టరలను సీజ్ చేసిన్నట్లు చెప్పారు.

## సైకో పోవాలి సైకిల్ రావాలి - టీడీపీ

నగరి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ నగరిలో నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించారు. చేపట్టారు. సైకో ప్రభుత్వం పోవాలి సైకిల్ రావాలని నినాదాలు చేస్తూ నిరాహారదీక్షలు చేపట్టారు. అలాగే నగరి మండలంలోని అయనంబాకంలో చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ సామూహిక నిరాహారదీక్ష గ్రామస్థులు చేపట్టారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా అరెస్టు చేయడం ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతమన్నారు. 2024లో రాష్ట్రంలో టీడీపీ కచ్చితంగా అధికారంలోకి వస్తోందని, ఇంతకు ఇంత వడ్డీ చెల్లిస్తామని తెలిపారు.

## ఘనంగా శ్రీకృష్ణ విగ్రహం ఊరేగింపు



కుప్పంరూరల్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక అధ్వర్యంలో ఆదివారకం శ్రీకృష్ణుడి విగ్రహంను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఏర్పాటుచేసిన శ్రీకృష్ణ విగ్రహంను ఐదు రోజుల అనంతరం ఊరేగించారు. కార్యక్రమంలో కృష్ణ, నిరంజన్, ప్రకాష్, కృష్ణారెడ్డి, మంజునాథశెట్టి, కృష్ణన్న, శరవణ తదితరులు పాల్గొన్నారు.

## మరుగుదొడ్లు నిర్మించండి సారూ !!

వి.కోట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

వి.కోట పట్టణంలో ఉన్న మండల పరిషత్, తహశీల్దార్, ఉపాధిహామీ, వెలుగు కార్యాలయాల వద్ద మహిళలు, ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ప్రజల అవసరాల దృష్ట్యా మరుగుదొడ్లను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఉచిత కంటి వైద్య శిబిరంకు స్పందన

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:



స్థానిక ఎన్‌పిసి నాయుడు చిల్డ్రన్స్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంను స్వర్గీయ మాజీ ఎంపీ ఎన్‌పి చెంగల్రాయనాయుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు మాజీ ఎమ్మెల్యే ఎన్‌పి వెంకటేశ్వరచౌదరి చేపట్టారు. ఈ శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 35 మంది ఆపరేషన్ల నిర్వహణకు గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. వీరిని తిరుపతిలోని శ్రీ అరవిందో కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఎన్‌పి వెంకటేశ్వరచౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, ఎన్‌పి వినయ్, ఎన్‌పి ధరణినాయుడు, రవీంద్రనాయుడు, డాక్టర్ అను, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వరసిద్ధుని సేవలో చిత్తూరు ఎమ్మెల్యే

కాణిపాకం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:



చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానంలో జరిగిన నూతన అద్దాల మండపం సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అద్దాలమండపం నిర్మాణ దాతలకు ఘనసత్కారం

కాణిపాకం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో నూతన అద్దాల మండపం నిర్మాణ దాతలు హైదరాబాద్ ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్, అధినేత మహేష్‌కుమార్‌రెడ్డి కుటుంబసభ్యులను దేవస్థానం తరపున ఆదివారం ఘనంగా సత్కరించారు. సుమారు కోటి రూపాయల వ్యయ అంచనాలతో ప్రధాన ఆలయ ప్రాంగణంలో దాతలు నిర్మించిన నూతన అద్దాల మండపంకు ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు.అనంతరం దాతలను ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశుల ఆధ్వర్యంలో స్వామివారి ప్రత్యేక దర్శనం కలి ్పంచారు. అనంతరం వారికి వేదమండపంలో వేదాశీర్వచనం చేసి సా ్వమివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు,ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరెండెంట్‌లు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## యుకెలో చంద్రబాబు అరెస్ట్‌కు ఎన్ఆర్ఐ టిడిపి నేతల నిరసన

కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త




కుప్పంకు చెందిన తెదేపా రాష్ట్ర నేత నాగవిశ్వేశ్వర్ నేతృత్వంలో యునైటెడ్ కింగ్‌డమ్ (లండన్)లో ఆదివారం ఉదయం ఎన్ఆర్ఐ టిడిపి కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈసందర్భంగా నాగ విశ్వేశ్వర్ మాట్లాడుతూ తెదేపా అధినేత చంద్రబాబునాయుడును సిఐడి పోలీసులు అరెస్ట్ చేయడం దారుణమని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక తెదేపా శ్రేణులపై కక్షసాధింపు చర్యలకు దిగుతోందని విమర్శించారు. తమ ఎన్ఆర్ఐ టిడిపి బృందం చంద్రబాబునాయుడుకు మద్దతుగా నిలుస్తామని పేర్కొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## బీజేపీ ఆధ్వర్యంలో నా భూమి నా దేశం

బాలాయపల్లి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:




బాలాయపల్లిలో బీజేపీ నాయకులు ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో మట్టి, బియ్యాన్ని సేకరిం చారు. ఇక్కడ సేకరించిన ట్టిని ఢిల్లీకి పంపుతామని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రశాంతి, సుధాకర్‌రాజు, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యానికి అపుస్మ అండగా ఉంటుంది

బాలాయపల్లి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:




ప్రైవేట్ పాఠశాలల యజమానులకు ఏపీపీయుఎస్ఎ అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ తెలిపారు. ఆదివారం బాలాయపల్లి వరసిద్ధి వినాయక ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జిల్లా ప్రైవేట్ యజమానుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్న 350 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించినట్లు తెలిపారు. పది మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతల దీక్షలను భగ్నం చేసిన పోలీసులు

- నేతలను పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

వెంకటగిరి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:



మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా వెంకటగిరి తహసీల్దారు కార్యాలయం కూడలి వద్ద నిరాహార దీక్ష చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, నాయకుల శిబిరాన్ని పోలీసులు భగ్నం చేశారు. నిరాహార దీక్ష చేస్తున్న శిబిరాన్ని పోలీసులు తొలగించారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తుంటే పోలీసులు శిబిరాన్ని తొలగించడం విచారకరమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. పోలీసులు వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శించారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడును అరెస్టు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీరం రాజేశ్వరరావు, చంద్రమౌళిరెడ్డి, శ్రీనివాసులు, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మకు నివాళి

కోట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం కోటలోని రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు కనుపూరు జగదీష్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలకు తెగించి పోరాడిన ధీరవనిత ఐలమ్మ అని కొనియాడారు.పలువురు రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# సూళ్లూరుపేట వాసులకు అత్యాధునిక ఇంటీరియల్ టెక్నాలజీ

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలో నూతనంగా గృహ నిర్మాణాలు చేపట్టే వారికి అత్యాధునికమైన టెక్నాలజీతో ఇంటీరియల్ చేసేందుకు ప్రత్యేక సంస్థ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం హోలీక్రాస్ సర్కిల్ సమీపంలో జిఎన్‌టి రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన న్యూలుక్ ఇంటీరియల్ హబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఇళ్లు నిర్మించుకునే వారు తమ గృహాలను అందంగా తీర్చిదిద్దాలంటే చెన్నై, తిరుపతి, నెల్లూరు వంటి సుదూర ప్రాంతాలకు



వెళ్లి అధిక వ్యయం చేసి ఇంటీరియల్ చేసుకునే వారని తెలిపారు. ప్రస్తుతం ఇవేమీ లేకుండా సూళ్లూరుపేటలో ఇంటీరియల్ హబ్ ప్రారంభం కావడం మంచి పరిణామం అన్నారు. దీంతో ఇళ్లు నిర్మించుకునే వారికి తక్కువ ధరతో మంచి ఇంటీరియల్ చేసుకునే అవకాశాలు మెరుగవుతాయని సంజీవయ్య చెప్పారు.మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్లు మీజూరు రామకృష్ణారెడ్డి, సౌజన్య, మునీంద్రబాబు, మహేశ్వర్, అయితా శ్రీధర్, అలవల సురేష్, కాకి శ్రీరామమూర్తి, డిసిఎంఎస్ మాజీ సభ్యులు జెట్టి వేణుయాదవ్, తడ ఎంపిపి కొళవి రఘు తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో యువకుని ఆత్మహత్య

తడ, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

తడ మండలం గ్రద్దగుంటకు చెందిన కుప్పంపాటి లోకేష్ (22) మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు, లోకేష్‌కు వివాహం జరిగి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని, కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నప్పటికీ కొంతకాలంగా పనికి వెళ్లకుండా మద్యం తాగుతూ ఉండటంతో అతని తండ్రి వెంకటరమణయ్య, భార్య కూడా ఇలా అయితే పిల్లల భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించడంతో మనస్తాపానికి గురై కలుపు మొక్కల నివారణ మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడని తెలిపారు. సూళ్లూరుపేటలోని ఒక ప్రభుత్వాసుపత్రికి, అనంతరం తిరుపతి స్విమ్స్ వైద్యశాలకు తరలించగా అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందినట్లు తడ పోలీసులకు మృతుని తండ్రి వెంకటరమణయ్య ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసుల అదుపులో తెలుగుదేశం నాయకులు

కోట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని అరెస్టు చేసిన నేపథ్యంలో ఆదివారం ఉదయం కోటలోని తెలుగుదేశం పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి శ్రేణులు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కోటలోని ఎంపిటిసిలు షంషుద్దిన్, దారా సురేష్, టిడిపి జిల్లా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్‌లను ఎస్ఐ పుల్లారావు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్ వద్దే ఉంచారు.

## వృద్ధురాలికి ఆర్థిక సహాయం

కోట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



కోట మండలం గూడలి పంచాయతీ పరిధిలోని ప్రకాశం కాలనీలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న వృద్ధురాలు మస్తానమ్మ (80)కు షిరిడీ అక్షయ సేవాసమితి నిర్వాహకులు అల్లం రమణయ్య రూ.5 వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా అల్లం రమణయ్య మాట్లాడుతూ మస్తానమ్మ అనే వృద్ధురాలి పరిస్థితి బాధాకరంగా ఉండటంతో అమెరికాలో ఉండే రాజశేఖర్‌రెడ్డికి వాట్సాప్ ద్వారా ఆమె ఆర్థిక పరిస్థితిని వివరించామని తెలిపారు. తక్షణమే ఆయన స్పందించి రూ.5 వేలు పంపించి ఆమెను ఆదుకోవాలని కోరడంతో ఈ సహాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబురావు పాల్గొన్నారు.

## పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించండి

కోట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగిస్తూ ఒత్తిడికి గురిచేయడం తగదని కోట మండల యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి మువ్వల మనోహర్ అన్నారు. ఆయన ఆదివారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ 5700 పేజిల పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్‌లు దిద్దే పనిని ఉపాధ్యాయులకు కేటాయించి పని ఒత్తిడికి గురిచేయడం తగదన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా సంస్కరణలతో 14 వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు ఏర్పడ్డాయని చెప్పారు. నాణ్యమైన విద్యను అందించే దిశగా ఉండాలే గాని, ఉపాధ్యాయులను, అధికారులను కించపరిచేలా సస్పెండ్ చేసేలా చర్యలు ఉండకూడదన్నారు. విద్యాశాఖ అధికారులను కించపరుస్తున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను విద్యాశాఖ బాధ్యతల నుంచి తొలగించాలని కోరారు. జిపిఎస్ అమలు చేయడం తగదన్నారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

## నారాయణను పరామర్శించిన ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్

చిల్లకూరు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త



మండలంలోని కమ్మవారిపాలెం గ్రామ సర్పంచ్, రైతు భరోసా అడ్వైజర్ కమిటీ సభ్యులు చిట్టేటి నారాయణ ఇటీవల అనారోగ్యంతో నెల్లూరు మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుని విశ్రాంతి తీసుకుంటున్న నారాయణను రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ కొర్న వెంకటనారాయణ చిల్లకూరులోని వారి నివాసానికి చేరుకుని పరామర్శించడం జరిగింది. త్వరగా కోలుకుని తిరిగి ప్రజలకు సేవలకు అందించాలని ఆ భగవంతునిని ప్రార్థిస్తున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ్, గురుస్వామి, కంటేపల్లి రమేష్, సుదీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో మండల స్థాయి క్రీడలు

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

సెప్టెంబర్ 15, 16 తేదీలలో ఎస్‌జిఎఫ్ మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను, క్రీడాకారుల ఎంపికలను చేపట్టనున్నట్లు ఎంఇఓలు కాపులూరు శ్రీనివాసులురెడ్డి, ఎన్.శీనయ్య ఆదివారం తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోటపోలూరులో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్ని కాయిట్‌తో పాటు యోగా, అథ్లెటిక్స్ ఉంటాయని తెలిపారు. వీటిలో అండర్-14, అండర్ 17 బాల బాలికలకు పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందని ఎస్‌జిఎఫ్ సమన్వయకర్త సన్నాయి భాస్కర్ తెలిపారు. ఈ పోటీల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. 15న బాలికలు, 16న బాలురకు పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 9347038584 నంబరును సంప్రదించాలని కోటపోలూరు ప్రధానోపాధ్యాయులు చంద్రజిత్‌యాదవ్ తెలిపారు.

## సిపాయి భరోసా అందజేత



ఏర్పేడు (శ్రీకాళహస్తి రూరల్), సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

మండలంలోని పాతవీరాపురం గ్రామంలో ఆదివారం సిపాయి భరోసా కార్యక్రమాల్లో భాగంగా ఓ కుటుంబాన్ని ఆదుకున్నారు. పాతవీరాపురంలో ఎస్.మునస్వామి రెడ్డి ఇటీవల అనారోగ్యతో ఆకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న రష్ అధినేత, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తాను అందిస్తున్న సిపాయి భరోసా లో ఆదుకొనుటకు ముందుకు వచ్చారు.ఆదివారం ఆయన మునస్వామి రెడ్డికుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటానని మీకు నేనున్నానని భరోసా కల్పించారు. ఆతని భార్య రుక్మిణమ్మకు ఒక సంవత్సరానికి సరిపడ్డ 40 రకాల నిత్యావసర సరకులు అందించారు.ఈ కార్యక్రమాల్లో ఆయనతోపాటు డాక్టర్ బాబు మాజీ ఎంపిటిసి మునిరత్నం రెడ్డి, గురువారెడ్డి, కొదండరామిరెడ్డి, అర్జున్ ఉదయ్, మునిరత్నం, కిరణ్, వంశీ, చందు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశశి గణేశ స్కానింగ్, డయోగ్నోస్టిక్స్ ప్రారంభించిన మేయర్



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త

నూతన ఎస్వీ అలర్జీ, చెస్ట్ హాస్పిటల్, ఎస్జి శ్రీ శశి గణేశ స్కానింగ్, డయోగ్నోస్టిక్స్‌ను నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష హాస్పిటల్ అధినేత డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ రామలక్ష్మి ఆహ్వానం మేరకు ఆమె పాల్గొని ఘనంగా ప్రారంభించారు. ఆదివారం డిబిఆర్ హాస్పిటల్ రోడ్డు, మారుతి నగర్, నూతనంగా నిర్మించిన నూతన గృహప్రవేశం, హాస్పిటల్ మేరకు డాక్టర్ శిరీష రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభోత్సవం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## దేశం పోలీసుల పెనుగులాట: ఆసుపత్రి పాలైన రెడ్డివారి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



తెలుగుదేశం అధినేత నారాచంద్రబాబునాయుడు ను సిఐడి పోలీసులు అదుపులో తీసుకున్న దృష్ట్యా తెలుగుదేశం శ్రేణుల్లో ఉత్కంఠత చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు సర్కిల్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగి, ధర్నా, నిరాహార దీక్షలకు తెలుగుదేశం శ్రేణులు పూనుకున్నారు. దాంతో టూటౌన్ పోలీసు స్టేషన్ సిఐ మల్లికార్జున్, ఎస్ ఐ మహేష్‌బాబు వారి సిబ్బంది అదుపులో తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ దేశం నాయకులు, పోలీసులకు తోపులాటలు, పెనుగులాటలు చోటు చేసుకున్నాయి. ఈ సంఘటనలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి అస్మారక స్థితికి గురయ్యారు. దాంతో వెంటనే పోలీసులు గురువారెడ్డిని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు ఆతనికి చికిత్సలు అందిస్తున్నారు.

## మృతుడు వెంకటరమణకు నివాళులు

### -తొట్టంబేడులో 10మంది నాయకులకు నోటీసులు



తొట్టంబేడు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు అరెస్టు కారణంగా తెలుగుదేశంపార్టీ రాష్ట్ర పిలుపు మేరకు నిరాహారదీక్షకు బయలుదేరుతున్న రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు మరియు మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, పాలసరఫరా మాజీ ఛైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడులను పోలీసులు అడ్డుకుని నిరాహారదీక్ష చేస్తున్న సమయంలో తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర, సిబ్బంది అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతేకాకుండా చంద్రబాబునాయుడు అరెస్టును చూసిన మాజీ ఎంపిటిసి భర్త వెంకటరమణ టీవి చూస్తుండగా గుండెపోటుతో మృతిచెందడంతో ఆయన మృతికి తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాలిమరళీనాయుడుతో పాటు పలువురు నాయకులు సునీల్, మాజీ ఎంపిటిసి సింగమాల భాస్కర్, కన్నలిరత్నయ్య, ఘట్టమనేనిశంకరనాయుడు, బిసి సెల్ నాయకుడు భాస్కర్, బాలసుబ్రమణ్యం, కిరణ్ తదితరులు నివాళులు అర్పించారు. తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో సుమారు 10మంది నాయకులకు నోటీసులు జారీచేసినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, రాంబట్లపల్లి భాస్కర్‌నాయుడు, మాజీ ఎంపిటిసి విజయకుమార్, మాజీ సర్పంచ్ చలపతి, శేషమనాయుడు, శంకరనాయుడు, వీరరాఘవులు, అనంతబాలునాయుడు, ప్రభాకర్, రాజా, గంధంశ్రీనివాసులు, మరియు చెంచయ్య, పెంచలయ్య, సుబ్బరామయ్య, రామచంద్రనాయుడు, మరియు సుధాకర్‌నాయుడు, కరీముల్లాభాష తదితరనాయకులు ఉన్నారు.

## జిల్లా యువజనోత్సవ పోటీలకు పేర్లు నమోదు చేసుకోండి

సెట్విన్ సిఇఓ మురళీకృష్ణ

తిరుపతి (క్రీడ), సెప్టెంబర్ 10, ప్రభాతవార్త

శ్రీ వివేకానంద స్వామి జయంతి సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే జాతీయ యువజనోత్సవం, రాష్ట్ర స్థాయిలో యువజనోత్సవంలో పాల్గొనేందుకు అర్హత పొందుటకు యువజన సర్వీసుల శాఖ, సెట్విన్ తిరుపతి వారి ఆధ్వర్యంలో జరిగే యువజనోత్సంలో భాగంగా జిల్లా స్థాయిలో యువ కళాకారులకు సెప్టెంబరు మాసంలో సాంస్కృతిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని సెట్విన్ సిఇఓ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ పోటీలలో మొదటి స్థాయిలో గెలుపొందిన వారికి రాష్ట్ర స్థాయి పోటీల నందు పాల్గొనే అవకాశం కల్పించడం జరుగుతుందని రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారు జనవరిలో జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాలలోపాల్గొనుటకు అర్హులన్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా, వివిధ సాంస్కృతిక పోటీలు 15 నుండి 29 సంవత్సరాలు వయస్సు కలిగిన యువతీయువకులకు ఈ దిగువ తెలిపిన పోటీ అంశములలో నిర్వహించడం జరగుతుందన్నారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో గెలుపొందిన వారు ఈ పోటీలలో పాల్గొనుటకు అనర్హులన్నారు.

ఈ పోటీలలో జానపద నృత్యాలు గ్రూపు, వ్యక్తిగతం 20 మంది సభ్యులు, జానపద గీతాలు గ్రూపు, వ్యక్తిగతం గరిష్ఠంగా వాయిద్యకారులతో సహా 10 మంది, జీవన నైపుణ్య విభాగం పోటీలు ఎ. కథ వ్రాయడం, బి. పోస్టర్ (గోడ పత్రిక), తయారీ, సి. ఫోటో గ్రఫీ అంశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఈ నెల 13వ తేదిలోగా తమ పేరు, పుట్టిన తేది, పోటీలో పాల్గొనే అంశములను వాట్స్ ఆఫ్ నెంబర్ నందు ఆన్‌లైన్ ద్వారా గానీ నమోదు చేసుకోవాలన్నారు. మరెన్ని వివరాలకు 0877 - 2286921, 9440573537, 7036428762 నందు సంప్రదించాలన్నారు.

## ఎస్వీయూ స్టాటిస్టిక్స్ విభాగంలో ధర్మనిధి ఉపన్యాసం

తిరుపతి (క్రీడ), సెప్టెంబర్ 10, ప్రభాతవార్త




శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, గణాంకశాస్త్ర విభాగంలో పద్మవిభూషణ్ డా. సిఆర్ రావుచే స్థాపించిన సిడి నాయుడు, ఆర్కాట్ లక్ష్మీకాంతం ధర్మనిధి ఉపన్యాసాన్ని ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె. రాజా రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పద్మవిభూషణ్ డా. సిఆర్ రావు గొప్పదనం గురించి పరిచయం చేశారు. ఈ ఉపన్యాసానికి వక్తగా ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్ స్టిట్యూట్, చెన్నై మ్యాథమెటికల్ ఇనిస్టిట్యూట్‌లలో పనిచేసిన డా. బివి రావు ప్రసంగించారు. కైనటిక్ ఎనర్జీ సిద్ధాంతాన్ని గణాంకశాస్త్రంలో ఉత్తమ ఫలితాలు రాబట్టడానికి ప్రయోగాత్మకంగా ఉపయోగించే పద్ధతులను వివరించారు. ఈ సమావేశంలో ప్రముఖుల సమక్షంలో తిరుపతి ఇంటర్నేషనల్ స్టాటిస్టిక్స్ అసోసియేషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని యస్వీయూ పక్షాన గణాంకశాస్త్ర విభాగాధిపతి డా. సరోజమ్మ నిర్వహించారు. సభలో ఆచార్య సుబ్రమణ్యం, ఆచార్య బాలసిద్ధముని, ఆచార్య వెంకట్రామయ్య, డా. హరి మల్లికార్జున రెడ్డి, డా. వెంకటరమణారెడ్డి, డా. మణి పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా

### యదేచ్ఛగా ఏటిలో తవ్వకాలు

వరదయ్యపాలెం, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త

వరదయ్యపాలెంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అధికార పార్టీకి చెందిన నాయకులే ఇసుక రవాణా చేస్తుండటం గమనార్హం. మండల పరిధిలోని అరునానది కర్ణానదిలలో ఏర్లు లోయదేచ్ఛగా తవ్వేస్తున్నారు. దీంతో నీటితో ఉండాల్సిన ఏర్లు రాళ్ళు రెప్పలతో నిండి పోయింది. ఇసుక యదేచ్ఛగా తవ్వకాలంలో భుగర్భ జలాలు అడుగంటపోయి సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఇసుక తవ్వకాలను అడ్డుకుని నదులను కాపాడాలని వేడుకుంటున్నారు.

## రామమందిరాలు లేని గ్రామాలు ఉండవు..పవిత్రారెడ్డి

తొట్టంబేడు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



రామమందిరాలు లేని గ్రామాలు దేశంలో ఎక్కడా ఉండవని శాసనసభ్యులు బియ్యపుమధుసూధన్‌రెడ్డి కుమార్తె బియ్యపుపవిత్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని లింగమనాయుడుపల్లి పంచాయతీ కురవకనేరి గ్రామంలో శ్రీ సీతారాములస్వామివారి ఆలయ భూమిపూజ కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి పవిత్రారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమెకు మండల వైకాపా కన్వీనర్ ఉన్నంవాసుదేవనాయుడు, గ్రామస్తుడు వెంకట్రామానాయుడు, గ్రామస్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె సీతారాములమందిర నిర్మాణానికి శాస్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. అలాగే మందిర నిర్మాణం కూడా సత్వరం పూర్తయ్యేలా చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లునాయుడు, ఎంజిఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్, రాజేంద్ర, మాజీ ఎంపిటిసి రత్నశేఖర్, మనోజ్, ఆనంద్, మురళీ, జీవినాయుడు, సురేష్, వెంకటకృష్ణ, ఓసూరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు

## కక్ష సాధింపుగా వ్యవహారిస్తే అది రాక్షస పాలన అవుతుంది

ఎస్‌సివి నాయుడు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును ఆరెస్టుకు నిరసనగా ఆదివారం మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు తన నివాసంలోనే నిరసన తెలిపారు. రెండో రోజు తన నివాసంలో తమ సహచరులతో కలసి ప్రశాంతంగా ఆందోళన చేపట్టారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ పాలకులు కక్ష సాధింపుగా వ్యవహారిస్తే అది రాక్షస పాలన అవుతుందని ఆయన విమర్శించారు. దేశంలోప్రతిష్టాత్మకమైన జి 20 సదస్సులు జరుగుతున్న తరుణంలో ప్రపంచ విజన్ చంద్రబాబునాయుడును అక్రమ కేసులో అరెస్టు చేసి జనం దృష్టి మరల్చారన్నారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ సందర్భంగా ఎస్‌సివి నాయుడు మాట్లాడుతూ పాలకుడు కక్షసాధింపు దిశగా వ్యవహారిస్తే అది రాక్షసపాలన అవుతుందన్నారు. రామరాజ్యం ఉండాల్సిన రాష్ట్రంలో రావణ రాజ్యం నడుస్తుందని దుయ్యబట్టారు. ఓ విజన్ గల నాయకునిఅక్రమకేసుల్లో ఇరికించటం అభాసుపాల్జేయాలనుకోవటం సిగ్గు చేటన్నారు. ప్రజా బలం ఉంటే ప్రజాకోర్టులో తెల్చుకోవాలని ఎస్‌సివి నాయుడు అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌సివి దిలీప్, సత్రవాడ ప్రవీణ్‌కుమార్, భాస్కర్‌నాయుడు, నారాయణయాదవ్, ఎస్‌సివి కిరణ్, పూల అనంద్, రాఘవరెడ్డి, సర్పంచ్ బాలాజి మాజీ సర్పంచ్ హరినాయుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు మోహన్‌నాయుడు తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గిరిజన కుటుంబానికి యువనేస్తం సహాయం:



ఏర్పేడు (శ్రీకాళహస్తి రూరల్), సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

మండలంలోని యువనేస్తం సారథ్యంలో ఓ నిరుపేద కుటుంబానికి ఆదుకొవటానికి నిత్యావసర సరకులను అందించారు. మండల కేంద్రంలోని మండల కార్యాలయం వద్ద ఆదివారం రాజుల పాళెం గిరిజన కాలనీకి చెంగమ్మ కుటుంబ పరిస్థితి దీనంగా ఉండటంతో గమనించిన యువనేస్తం ఆ కుటుంబానికి 60కిలోల బియ్యం, నెలకు సరిపడ్డ నిత్యావసర సరకులు, కూరగాయలు అందించారు. గిరిజన కాలనీకి చెందిన చెంగమ్మ కుటుంబం పేదరికంతో కట కట లాడుతుండగా సహాయం కోసం అర్థించారు. కో ఆర్డినేటర్ అరుణ సూచనలతో నిత్యావసర సరకులు అందించారు. ఆమె కుమారుడు శివ తిరుపతిలో డిగ్రీ చదువుతున్నాడు. కానీ అర్థిక పరిస్థితి వివరించగా ఉచిత ఉద్యోగ సామగ్రిని అందించటంతో భవిష్యత్తులో ఆతని చదువులకు తమ వంతు సహాయం చేస్తామని భరోసా ఇవ్వటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ట్రస్టు అధ్యక్షులు వినోద్, ఏర్పేడు మండల కో ఆర్డినేటర్ అరుణ, శ్రీకాళహస్తి మండల కో ఆర్టినేటర్ నాగమణి, వాలంటీర్లు వెంకటేష్, హేమ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## గాయపడ్డ కార్యకర్తను పరామర్శించిన డాక్టర్ వియం.థామస్

వెదురుకుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :



మండల కేంద్రంలో గత మంగళవారం జరిగిన పరిచయ వేధిక కార్యక్రమంకు హాజరై తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కార్యకర్తను గంగాధర నెల్లూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జీ డాక్టర్ వియం.థామస్ ఆదివారం పరామర్శించారు. మండలంలోని టికెయం.పురంకు చెందిన భాస్కర్‌కు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. సమాచారం తెలిసి తిరుపతి రమాదేవి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భాస్కర్‌నుతో మాట్లాడి పరిస్థితి తెలుసుకుని పది వేలరూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉండటంతో పాటు అత్యవసర పరిస్థితిలో ఉన్న ప్రతి కార్యకర్తను, నాయకుడికి అండగా ఉంటానని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభావశీలుల కమిటీ సభ్యులు భీమనేని చిట్టిబాబు, నియోజకవర్గం మీడియా సమన్వమకర్త గురసాల కిషన్ చంద్, మాజీ జిల్లా టీడీపీ కార్యదర్శి మోహన్ మురళి, నియోజకవర్గం ఎస్సీ అధ్యక్షులు గుండయ్య, నాయకులు గాలి బాబు నాయుడు, కుప్పయ్య, సుధాకర్, దాము, సిద్దయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## పవన్‌పై పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషం

-జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:



శనివారం హైదరాబాద్ నుండి విజయవాడకు వస్తున్న తమ జనసేనాని పవన్‌కళ్యాణ్‌పై పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్ మండిపడ్డారు. పోలీసుల తీరును ఖండిస్తూ ఆదివారం ఆయన ఛలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అయితే పోలీసులు జనసైనికులను విజయవాడ వెళ్లనీకుండా వారి దీక్షను భగ్నం చేసి అందరినీ అరెస్ట్ చేసి ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కిరణ్‌రాయల్ మాట్లాడు తూ మా అధినేత పవన్ విజయవాడలో పిఏసి సమావేశానికి వస్తుంటే ఆయనను పోలీసులు అడ్డుకోవడం హేయమైన చర్యని దుయ్యబటారు. ప్రతిపక్షాలపై అధికార పార్టీ చేస్తున్న ఆగడాలను నిరసిస్తూ ఛలో విజయవాడకు పిలుపునిస్తే మమ్మల్ని అక్రమంగా అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బందించడం ఏంటంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. మా అధినేతను అడ్డుకుంటే జనసైనికులు చూస్తూ ఊరకోబోమన్నారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు రాజారెడ్డి, బాబ్జి, మధుబాబు, రాజేష్ ఆచారి, పార్థ్, హేమంత్, నాగరాజు, రమేష్, లావణ్య, దుర్గాదేవి, చందన, మనోజ్, లోహిత్, పురుషోత్తం, సాయికుమార్, నవీన్, సుబ్బుయాదవ్, లోకేష్ ఉన్నారు.

## ఖేలో ఇండియా ద్వారా మైదానానికి నూతన వసతులు

నగరి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:



ఖేలో ఇండియా ద్వారా నగరి పట్టణంలోని కేవీకే మైదానానికి అదనపు వసతులు రానుంది. మంత్రి రోజా ఆదేశాల మేరకు విజయవాడ, హైదరాబాద్ నుంచి క్రీడాశాఖకు సంబంధిత ఉన్నత అధికారులు కేవీకే మైదానానికి విచ్చేశారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న వసతులకు అనుగుణంగా స్థల సర్వే చేయడంతో పాటు మైదాన అభివృద్ధికి అవసరమైన వసతులపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా నగరిలోని కేవీకే మైదానాన్ని పరిశీలించిన శాప్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.విజయసాగర్ మాట్లాడుతూ క్రికెట్ గ్రౌండ్‌కు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు బ్యాడ్మింటన్‌కు ఉడన్ కోర్టు, బాస్కెట్ బాల్ కోర్టు దానికి ఫ్లడ్ లైట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిశీలనకు విచ్చేసిన వరిలో సైట్ ఇంజనీర్ ఫిరోజ్, డీఎస్‌డీవో బాలాజీ, కేవీకే కోచ్ బాబు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు పాల్గొన్నారు.

## పురవీధుల్లో గెరిగె ఊరేగింపు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలో మంగళవారం నుంచి జరగనున్న గంగజాతర సందర్భంగా ఆదివారం ఉదయం గెరిగెను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గంగజాతర కమిటీ వారు ఆధ్వర్యంలో స్థానిక శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయం నుంచి డప్పు వాయిద్యాల నడుమ గెరిగెను పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపు కార్యక్రమం పట్టణంలోని పలు వీధుల్లో ఊరేగించారు. భక్తులు గెరిగెకు మంగళ హారతులు ఇచ్చారు. అలాగే 12వ తేదీ మంగళవారం రాత్రి మంచినీళ్ళగుంట నుంచి చాటు బండి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. 13వ తేదీ బుధవారం గంగజాతర కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందు కోసం పట్టణంలోని పలు వీధుల్లో అమ్మవారి ప్లెక్సీ బోర్డును ఏర్పాటు చేస్తున్నారు. వీధుల్లోసుందరంగా వేపాకు తోరణాలు కూడా అలంకరించారు. రాత్రి పాట కచ్చేరి కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు. భక్తులకు అమ్మవారి దర్శనం కోసం ఆలయం వద్ద ప్రత్యేక క్యూ లైన్లు కూడా ఏర్పాటు చేయనున్నారు.

## వైభవంగా శ్రీ రుక్మిణ కల్యాణం

పుత్తూరురూరల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశి వేశ్వర స్వామి ఆలయ ప్రాంగ ణంలో ఉన్న గీతామందిరంలో ఆదివారం సాయంత్రం శ్రీకృష్ణ జయంతి సందర్భంగా వైభవం గా శ్రీ రుక్మిణీ కల్యా ణం నిర్వహించారు. ఉదయం ఆల యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉభయ దాతలు శ్రీమ తి రూపవాణి శ్రీ నాగిశెట్టి బాలాజీ దంపతులు వారిచే రుక్మిణీ కల్యాణం నిర్మించారు. అలాగే ఎస్.కాంతమ్మ ఉభయ దాతలు అలాగే మున్సిపల్ పరిధిలోని పిళ్లారిపట్టు గ్రామంలో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో కూడా శ్రీకృష్ణుల వారి కల్యాణోత్సవాన్ని అలాగే రథోత్సవం పండరి భజన నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## రెండు రోజులుగా పట్టణాధ్యక్షుడు హౌస్‌అరెస్టు

.శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసన తెలిపేందుకు వెళ్తున్న పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడును ఆయన ఇంటివద్దనే టుటౌన్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈసందర్భంగా విజయకుమార్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పరిస్థితి దిగజారిపోయందని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రిని అరెస్టుచేసి కక్ష్యసాధింపు చర్యలుతీసుకోవడం వైకాపా పార్టీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి తగదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో రావాలన్నా రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీని గెలిపించాలని కోరారు. తెదేపా నేతను రిమాండ్ విధించడం చీకటిరోజని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఎన్నటికీ న్యాయం గెలుస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉన్న తెదేపా నాయకులు, నేతలు అందరు కలసి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీని గెలిపించుకుంటామన్నారు.

## కొనసాగిన గృహ నిర్భందాలు... నిరసనలు



గృహ నిర్భందంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, వినూత్న నిరసన

పుత్తూరు, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టు నేపథ్యంలో ఆదివారం రెండో రోజు కూడా టిడిపి నాయకులు గృహ నిర్బంధాలు కొనసాగాయి. టిఎన్‌టియుసి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, బిసి సెల్ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ డి.జి.గోపాల్ తదితరులను గృహ నిర్బంధంలో వుంచారు. ఈ సందర్భంగా నాయకులు ముఖానికి నల్ల వస్త్రం ధరించి నిరసన వ్యక్తం చేశారు. షణ్ముగరెడ్డి ఆధ్వర్యంలో మోకాళ్లపై కూర్చుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయ జీవితంలో చంద్రబాబు అవినీతి మచ్చ లేని నాయకుడన్నారు. ఏ ఒప్పందం, ఫైలు పైన కూడా సంతకం చేయని చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నిందితుడిగా చేర్చడం కేవలం రాజకీయ కక్ష సాధింపేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి నాయకులు గుర్రప్ప, మోహన్‌బాబు, టిడిపి నాయకులు కన్నన్, మునిప్రభాకర్‌రెడ్డి, రాము యాదవ్, సుబ్రమణ్యంనాయుడు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## రెండోరోజు టిడిపి నేతల దీక్షలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ టిడిపి నేతలు చేపట్టిన దీక్షలు ఆదివారం రెండోరోజు కొనసాగాయి. మాజీమంత్రి పరసా రత్నం శనివారం మధ్యాహ్నం నుంచి నిరాహార దీక్షలో పాల్గొని రాత్రి కూడా అక్కడే నేలపై పడుకొని దీక్ష చేశారు. పార్టీ కార్యాలయం వరండాలో ఆయన దీక్ష చేస్తుండగా పలువురు నేతలు ఆయన్ను కలిసి సంఘీభావం ప్రకటించారు. ఆదివారం ఆయన తన దీక్షను యధావిధిగా కొనసాగించారు. చంద్రబాబునాయుడిని విడుదల చేసే వరకు తమ దీక్షను కొనసాగిస్తామని ఆయన చెప్పారు. ఈ దీక్షలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. అలాగే సూళ్లూరుపేట పట్టణ టిడిపి అధ్యక్షుడు ఆకుతోట రమేష్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. నిరసన కార్యక్రమంలో పాల్గొనకుండా ఆయనను ఇంటి వద్దే కట్టడి చేశారు. ఇదిలావుంటే చంద్రబాబునాయుడుపై బనాయించిన కేసుల విషయంలో విజయవాడ ఏసీబీ కోర్టులో జరుగుతున్న సమాచారం తెలుసుకునేందుకు కార్యకర్తలు పెద్దఎత్తున టిడిపి కార్యాలయం వద్దకు తరలివచ్చారు. ఎప్పటికప్పుడు ఆతృతగా సమాచారం తెలుసుకొని తమ నేత ఎప్పుడు విడుదల అవుతారన్న ఉత్కంఠతో గడిపారు. పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పహారా కాశారు.

## చంద్రబాబును అరెస్టు చేయడం బాధాకరం

### నల్లబ్యాడ్జీలతో టిడిపి నాయకుల నిరసన



చిల్లకూరు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడును అరెస్టు చేసి రిమాండుకు తరలించడం బాధాకరమని ప్రముఖ పారిశ్రామిక వేత్త కానంకి నానాజీ అన్నారు. రెండు రోజుల నుంచి చంద్రబాబు నాయుడును అక్రమంగా సిబిఐ అధికారులను అదుపులోకి తీసుకుని విచారించడం బాధాకరమని వారు తెలిపారు. దీనికి నిరసనగా చిల్లకూరు గ్రామంలోని కానంకి నానాజీ వారి నివాసంలో నాయకులతో కలిసి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ఆర్ పార్టీ కక్ష్యపూరితంగానే చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం జరిగిందన్నారు. 40 సంవత్సరాలు రాష్ట్ర ప్రజలకు ఎన్నో సేవాకార్యక్రమాలు చేపట్టిన మహోన్నతమైన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని అన్నారు. సైకో పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో సైకో జగన్ ను ఓడించడం ఖాయమన్నారు. ఆదివారం సాయంత్రం కోర్టులో లాయర్ల వాదన అనంతరం జడ్జి హిమబిందు చంద్రబాబు నాయుడును రిమాండ్‌కు పంపడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిల్లకూరు పట్టాబిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, నెల్లూరు రామమూర్తి, యనమల దినేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో హైకోర్టు జడ్జి: దుప్పాల



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం హైకోర్టు జడ్జి దుప్పాల వెంకటరమణ తన సహచరులతో దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ కెవి సాగర్‌బాబు ఆదేశాలతో డెప్యూటీ ఇఓ వెంకట సుబ్బయ్య టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ స్వాగతం పలికారు.దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు, శేష వస్త్రాలను అందించారు. వారికి జ్యూడిషియల్ శాఖ తరఫున అడిషనల్ సివిల్‌జూనియర్ జడ్జి కృష్ణ ప్రియ సీనియర్ సివిల్‌జడ్జి బేబీ కృష్ణప్రియలు స్వాగతం పలికి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## ముత్యాలమ్మకు వెండి ఉరువుల వితరణ



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మగుడికి తిరుపతి వాసులు వెండి వస్తువులు వితరణ అందించారు. ఆదివారం తిరుపతికి చెందిన రాజేంద్రన్,రాజ్యలక్ష్మీదంపతులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులును కలసి తాము ముత్యాలమ్మకు వెండి వస్తువులు వితరణ ఇవ్వాలని సూచించారు.వారితో పాటు రుష్యేంద్రబాబు, జయంతి, సుధాకర్‌పద్మావతి, నారాయణ ధనలక్ష్మీ కుటుంబ సభ్యులు అమ్మవారికి వెండి నుదుటి బొట్టు, ఇత్తడిశూలం అమ్మవారికి వితరణగా అందించారు.మహిమాన్విత తల్లి ముత్యాలమ్మకు భక్తుల నుంచి కానుకలు అందుతున్నాయని అభివృద్ధి పథంలో ఆలయం నడుస్తుందని ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు.ఈ కార్యక్రమాల్లో మొగరాల గణేష్, గిరిగౌడ్, బాలాగౌడ్, ధనంజయులు,సునీల్,పూజారి పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా నూతన అద్దాలమండపంకు సంప్రోక్షణ



నూతన అద్దాల మండపముకు హోమ కలశాలలోని పవిత్ర జలంతో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు. సంప్రోక్షణకు ప్రధాన కలశాలను తీసుకు వస్తున్న అర్చకులు, పూర్ణాహుతి

కాణిపాకం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో నూతనంగా నిర్మించిన అద్దాలమండపం, రాగిరేకులు తొడిగిన బంగారు ధ్వజస్థంభం, షోడశ గణపతుల మండపంలకు ఆదివారం శాస్త్రోక్తంగా సంప్రోక్షణ కార్యక్రమంను నిర్వహించారు. కాణిపాకం దేవస్థానం ప్రధాన ఆలయం ఆవరణలో దాతలు హైదరాబాద్‌కు చెందిన ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ అధినేత మహేష్‌కుమార్‌రెడ్డి కుటుంబసభ్యులచే సుమారు కోటి రూపాయల వ్యయంతో నూతనంగా అద్దాలమండపంను రాతితో నిర్మించారు. ఈఅద్దాల మండపంకు ఉదయం 9 నుండి 10 గంటల మధ్య శాస్త్రోక్తంగా సంప్రోక్షణ కార్యక్రమంను నిర్వహించారు. అలాగే నూతనంగా దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న బంగారు ధ్వజస్థంభంకు నూతన రాగిరేకుల తొడిగే పనులు పూర్తికావడంతో ఈధ్వజస్థంభానికి, దేవస్థానం పరివార ఆలయాలైన శ్రీమణికంఠేశ్వరాలయం, శ్రీవరదరాజస్వామి ఆలయంలలో నూతనంగా నిర్మించిన హోమ మండపంలకు కూడా సంప్రోక్షణ నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశుల ఆధ్వర్యంలో ఈసంప్రోక్షణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈమేరకు శనివారం రాత్రి గణపతిపూజ, పుణ్యాహావాచనం, వాస్తు శాంతి, రక్షాబంధనం, కలశపూజ, పట్టు వస్త్రాల సమర్పణ పూజాది కార్యక్రమాలతో సంప్రోక్షణ కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జి ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చకులు వేదపండితులు ప్రారంభించారు. అలాగే ఆదివారం ఉదయం ఆయా ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన హోమగుండాల వద్ద గణపతిహోమం, దీక్షాహోమం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన కార్యక్రమాలను నిర్వహించారు,అలాగే స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి ప్రత్యేక అభిషేకంలను నిర్వహించి నూతన అద్దాల మండపంను సంప్రోక్షణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాగిరేకుల తొడుగులు పూర్తయిన బంగారు ధ్వజస్థంభంకు కళాకర్షణ, ధ్వజస్థంభం సంప్రోక్షణ అదే సమయంలో దేవస్థానం పరివార ఆలయాలైన శ్రీమణికంఠేశ్వరాలయం, శ్రీవరదరాజస్వామి ఆలయంలలో నూతనంగా నిర్మించిన హోమ మండపంలకు కూడా సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో అద్దాల మండపం దాత ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్, హైదరాబాద్ అధినేత మహేష్‌కుమార్‌రెడ్డి కుటుంబసభ్యులు, ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు. ఈఈ వెంకట నారాయణ, ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డిలతో పాటు ఆలయ ఉభయదారులు, భక్తులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## వైభవంగా గెరిగె ఊరేగింపు



నగరి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:

పట్టణంలో గంగజాతర సందడి ఆదివారం మొదలైంది. జాతర సాంప్రదాయ ఆచార వ్యవహారాల్లో భాగంగా గంగమ్మతల్లికి ప్రీతికరమైన గెరిగె ఉత్సవాన్ని తలారి వీధి గంగమ్మగుడి వద్ద నిర్వాహకులు ప్రారంభించారు. జాతర హద్దుల్లో ఉన్న ఇళ్ళకు ఊరేగింపుగా వెళ్లిన గెరిగెకు పసుపు కుంకుమల నీటితో హారతులు తీసి దర్శించుకున్న మహిళలు నైవేద్యం సమర్పించి బండారం స్వీకరించారు. గెరిగె ప్రారంభోత్సవంలో జాతర నిర్వాహకులు నరసింహారెడ్డి, సురేష్‌నాయుడు,దయానిధి, చిరంజీవిరెడ్డి, ఇంద్రయ్య, మణిగండ, టి.కె.మధన, శ్రీనివాసన్, జ్యోతిరెడ్డి, బాబురెడ్డి, రామకృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, పాలేగారు గోపి, సేదు, రాజేష్, రవి, విక్కీ, కుమార్, మహేష్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## ఆహుతులను అలరిస్తున్న చిన్నారుల నృత్యోత్సవాలు

### -మహతిలో వేడుకగా ప్రదర్శనలు



తిరుపతి, సెప్టెంబర్ 10ప్రభాతవార్త:

కృష్ణదేవరాయల 33వ వార్షిక జాతీయ సంగీత సాహిత్యనృత్యోత్సవాలు ఆదివారం రెండవరోజువేడుకగా సాగాయి. ఆదివారం ఉదయం నుండి రాత్రి 9గంటల వరకు 60మంది చిన్నారులు పలుప్రాంతాల నుండి విచ్చేసి తమతమ నైపుణ్యాలను ప్రదర్శించారు. చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకుంటున్నాయి.రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో మహతిలో జరిగిన నృత్యోత్సవాల్లో పాల్గొని తమతమ ప్రదర్శనలిచ్చిన చిన్నారులకు సర్టిఫికెట్లు, నగదు ప్రోత్సహాకాలు, జ్ఞాపికలు బహుకరించారు. ప్రతి ఒక్కరూ నృత్యోత్సవాలను తిలకించి కళాకారులను ప్రోత్సహించాలని గుండాల గోపీనాథరెడ్డి కోరారు.

## సాధుసుబ్రమణ్యశాస్త్రికి పుష్పాంజలి

తిరుపతి, సెప్టెంబర్ 10ప్రభాతవార్త:



తిరుమల ఆలయంలోని శాసనాలను అనువదించి ఆలయ చరిత్రను, స్వామివారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహానీయుడు సాధుసుబ్రమణ్యశాస్త్రి అని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాధుసుబ్రమణ్యశాస్త్రి 42వ వర్ధంతి సందర్భంగా అన్నమా చార్యకళా మందిరంలో జరిగిన కార్యక్రమానికి టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హాజరయ్యారు. టిటిడి జెఇఓ సదాభార్గవి,ఛైర్మన్ భూమన శాస్త్రి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

## మాజీ ఇస్రో శాస్త్రవేత్తకు ఘన సన్మానం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

శ్రీహరికోటలో శాస్త్రవేత్తగా పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ చేసిన సూళ్లూరుపేట జూనియర్ కళాశాల పూర్వపు విద్యార్థి, పూర్వపు విద్యార్థుల సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎల్.శ్రీనివాసులును ఆదివారం సూళ్లూరుపేట పూర్వపు విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఐ ఆదూరి శ్రీనివాసులు, ఎంఇఒ కాపులూరు శ్రీనివాసులు ముఖ్యులుగా పాల్గొని పూర్వపు విద్యార్థుల సంఘం తరపున ఆయనను ఘనంగా సన్మానించారు. సూళ్లూరుపేటలో పుట్టి పెరిగి ఇక్కడే విద్యాభ్యాసం చేసి శ్రీహరికోటలో శాస్త్రవేత్తగా పనిచేసి గణనీయమైన సేవలు అందించిన ఎల్.శ్రీనివాసులును సన్మానించడం గర్వంగా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎల్.శ్రీనివాసులు మాట్లాడుతూ అందరి సహకారం, ప్రోత్సాహంతోనే తాను శ్రీహరికోటలో పనిచేసి సూళ్లూరుపేట వాసిగా మంచి పేరు తెచ్చుకున్నానన్నారు. తన అభ్యున్నతికి తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం భాస్కర్‌బాబు, ఉస్మాన్‌బాషా, ఆదినారాయణ, అనిల్‌రెడ్డి, ఉమ, డాక్టర్ సాయిరామ్, ధనుంజయరెడ్డి, రాజేంద్ర, పలువురు షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో పలువురు ప్రముఖులు



కాణిపాకం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈమేరకు ప్రముఖ సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, స్వామివారి ప్రధాన ఆలయ పునర్నిర్మాణ దాతలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్‌లు కుటుంబసమేతంగా కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యా సాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు

## శ్రీవారి సేవలో ఎంపి ,తుడ ఛైర్మన్



తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, తుడ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో వీరివురూ ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టవర్ క్లాక్ వద్ద ఆందోళన

చంద్రగిరి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:



చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టనీయకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఇందులో భాగంగా టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధను హౌస్ అరెస్ట్ చేశారు. అయితే ఉదయం టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి, తనయుడు పులివర్తి వినీల్ చంద్రగిరి చేరుకుని టవర్ క్లాక్ వద్ద చంద్రబాబు అరెస్ట్‌ను ఖండిస్తూ నిరాహార దీక్షకు బైఠాయించారు. దీంతో సమాచారం అందుకున్న టిడిపి శ్రేణులు నిధానంగా ఇంతింతై వటుడింతై అనే రీతిలో మధ్యాహ్నానికి పెద్ద సంఖ్యలో ఇక్కడికి చేరుకుని తమ నాయకురాలికి మద్దతుగా బైఠాయించారు. ఒక దశలో పోలీసులు దీక్షను భగ్నం చేయాలని భావించినప్పటికీ వారి ప్రయత్నం ఫలించలేదు. ఇక చేసేది లేక ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పీ ఆదేశాలతో పలువురు సిఐలు, ఎస్ఐలను, పదుల సంఖ్యలో పోలీసులను చంద్రగిరిలో మోహరించారు. మధ్యాహ్నం దీక్షా శిబిరాన్ని మార్చినప్పటికీ చంద్రబాబు కోర్టు తీర్పు కోసం నిరీక్షించారు. సామాజిక మాధ్యమాలలో వస్తున్న కోర్టు వార్తలను పరిశీలించిన టిడిపి నాయకులు సెక్షన్ 409 వర్తించదని కోర్టు తిరస్కరించడంపై రిమాండ్ విధించరనే విశ్వాసంతో పొద్దుపోయేంత వరకు నిరీక్షించారు. చివరికి సాయంత్రం 7 గంటల సమయంలో చంద్రబాబుకు రిమాండ్ విధించినట్లు తెలుసుకుని షాక్‌కు గురయ్యారు. దీంతో దీక్షా శిబిరం నుండి టవర్ క్లాక్ వద్దకు చేరుకున్న సుధారెడ్డి మాట్లాడుతూ సెక్షన్ 409 తిరస్కరించిన కోర్టు రిమాండ్ విధించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం టిడిపి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు ఆవేదన చెందారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తామంటూ పోలీసులు అరెస్టులకు పాల్పడే అవకాశం వుందన్నారు. సోమవారం ప్రతి మండలంలోని నాయకులు ఓటర్ల నమోదు ప్రక్రియపై తహశీల్దార్ కార్యాలయాలకు చేరుకుని ఫారమ్ 6, 7, 8 యాక్సెప్ట్ చేయడంపై పరిశీలించాలన్నారు. ఎన్నికల కమీషన్ రూల్ పొషన్ మేరకు మనకు సంబంధం లేకుండా ఏ ఒక్క బిఎల్ఓ కానీ ఫారమ్ 6, 7, 8లను ఓకే చేయడానికి లేదన్నారు. దొంగ ఓట్లు, డెత్ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మన పెదాయన ఎట్టి పరిస్థితుల్లోని క్లీన్ చిట్‌తో బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.